# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ జాతీయ ప్రయోజనాలను పెంపొందించేలా భాగస్వామ్యాలను ఏర్పరచుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దౌత్యవేత్తలకు సూచించారు.
- ❖ ఆధునిక క్రీడా వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- ❖ నేపాల్‌లో చిక్కుకుపోయిన భారతీయులను రక్షించే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నామని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.
- ❖ గడచిన దశాబ్ద కాలంలో దేశ రక్షణ రంగ ఉత్పత్తి సుమారు నాలుగు రెట్లు పెరిగిందని కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంతో భారత్ సంబంధాలు ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఇండియన్ ఫారిన్ సర్వీస్ (IFS)కు చెందిన ట్రైనీ అధికారులు రాష్ట్రపతి భవన్‌లో ఈరోజు ఆమెను కలిశారు. అవసరమైన సమయాల్లో దేశ పౌరులకు భారత దౌత్య కార్యాలయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ద్రౌపది ముర్ము యువ దౌత్యవేత్తలకు సూచించారు. IFS అధికారులు ప్రభుత్వానికి మాత్రమే కాక, 140 కోట్ల మంది దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు కూడా ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విదేశాలలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం, దేశ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడం, ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలను బలోపేతం చేయడం వంటి గొప్ప అవకాశం, బాధ్యత ట్రైనీ అధికారులపై ఉందని వ్యాఖ్యానించారు. భారతదేశ జాతీయ ప్రయోజనాలను పెంపొందించే భాగస్వామ్యాలను ఏర్పరచుకోవాలని రాష్ట్రపతి దౌత్యవేత్తలకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆధునిక క్రీడా వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. `ఖేలో ఇండియా సంవాద్` కార్యక్రమంలో దృశ్యమాధ్యమ విధానంలో ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగిస్తూ... క్రీడా విశ్వవిద్యాలయాల నుండి ఆధునిక శిక్షణా కేంద్రాల వరకు.. ప్రతి దశలోనూ ప్రతిభను ప్రోత్సహించేలా దేశవ్యాప్తంగా ఒక వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. క్రీడలు.. పతకాలు గెలిచేందుకు మాత్రమే పరిమితం కాదని, దేశ నిర్మాణంలో క్రీడా సామర్థ్యాన్ని, యువశక్తిని ఏకం చేసే ఒక గొప్ప లక్ష్యమని అన్నారు. చిన్నారులకు ఆసక్తి ఉన్న క్రీడపైనే కాకుండా, వారికి ఏ క్రీడ అత్యంత అనుకూలంగా ఉంటుందో గుర్తించడంపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. `ఖేలో ఇండియా సంవాద్` అనేది క్రీడల గురించి చర్చించే కార్యక్రమం మాత్రమే కాదని, ఇక్కడ వెలువడే ప్రతి ఆలోచన దేశ క్రీడా విధానానికి కొత్త దిశను చూపగలదని వ్యాఖ్యానించారు. దేశ యువశక్తి నుండి వచ్చే ఈ కొత్త ఆలోచనలే `వికసిత్ భారత్` లక్ష్యాన్ని సాకారం చేయడంలో కీలకంగా మారతాయని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆకస్మిక వరదల కారణంగా నేపాల్‌లో చిక్కుకుపోయిన భారతీయులను గుర్తించి, రక్షించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నామని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... విపత్తు సంభవించిన సమయంలో నేపాల్‌లో ఉన్న 288 మంది భారతీయులతో ఇంకా సంప్రదింపులు జరగలేదని, వీరిలో త్రిశూలి-1 విద్యుత్ ప్రాజెక్టులో పని చేస్తున్న 73 మంది కూడా ఉన్నారని చెప్పారు. నేపాల్‌కు 47 టన్నులకు పైగా అత్యవసర సహాయక సామగ్రిని పంపించామని, రక్షణ, సహాయక చర్యల కోసం బెయిలీ వంతెనలను కూడా తరలిస్తున్నామని వివరించారు. చైనా వైపు చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా తరలించేందుకు బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం అన్ని ప్రయత్నాలు చేస్తోందని జైస్వాల్ తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో దేశం స్వయం సమృద్ధి దిశగా పయనిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని వెహికల్ ఫ్యాక్టరీ, జబల్‌పూర్ లో టి-సిరీస్ యుద్ధ ట్యాంకుల సమగ్ర మరమ్మతు కోసం 472 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ప్రాజెక్టుకు కేంద్రమంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత దశాబ్ద కాలంలో రక్షణ రంగ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగి సుమారు లక్షా 80 వేల కోట్ల రూపాయలకు చేరగా, ఎగుమతులు దాదాపు 39 వేల కోట్ల రూపాయలకు పెరిగాయని చెప్పారు. 2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి 50 వేల కోట్ల రూపాయల విలువైన రక్షణ ఎగుమతులను సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 29వ తేదీ నుండి 4 రోజుల పాటు ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్ లలో పర్యటించనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షులు షవ్కత్ మిర్జియోయేవ్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో రెండు రోజుల అధికారిక పర్యటన జరుపుతారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పశ్చిమ విభాగం కార్యదర్శి సి.బి. జార్జ్ తెలిపారు. భారత్, ఉజ్బెకిస్తాన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రధానమంత్రి... మిర్జియోయేవ్‌తో ప్రతినిధి స్థాయి చర్చలు జరుపుతారని చెప్పారు. కిర్గిజ్ రిపబ్లిక్ అధ్యక్షులు సాదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాన మంత్రి తాష్కెంట్ నుండి కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ నగరానికి వెళ్తారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా నరేంద్ర మోదీ ఈ నెల 31న జరగనున్న 26వ షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారని, ఆ వేదికపై భద్రత, అనుసంధానత, అవకాశాలకు సంబంధించి భారతదేశ ప్రాధాన్యతలను ఉద్ఘాటిస్తారని సి.బి. జార్జ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా పటిష్టమైన క్రీడా వ్యవస్థను, మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ప్రభుత్వం 36 వేల కోట్ల రూపాయలను మంజూరు చేసిందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయా తెలిపారు. పాలజ్‌లోని ఐఐటి గాంధీనగర్‌లో జరిగిన `ఖేలో ఇండియా డైలాగ్` సందర్భంగా ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... క్రీడా అకాడమీలను స్థాపించడానికి, క్రీడా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఈ నిధులను వినియోగిస్తామని చెప్పారు. దీని ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రపంచ వేదికలపై పోటీపడే అవకాశాలు లభిస్తాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, అవకాశాలను ప్రపంచం గుర్తిస్తోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ముంబైలో ఈరోజు జరిగిన రోడ్‌షో లో ఆయన మాట్లాడుతూ... ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఈ ఏడాది నవంబర్ 2 నుండి 5 వరకు న్యూఢిల్లీలో జరగనున్న `భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో-2026`లో సుమారు 8 నుండి 10 దేశాలు భాగస్వామ్య దేశాలుగా పాల్గొంటాయని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సామర్థ్య పెంపుదల, నిబద్ధత, నాణ్యత, విశ్వసనీయత, సరసమైన ధరలు ఆవశ్యకమని కేంద్రమంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ ఆతిథ్యంలో బ్రిక్స్ 18వ శిఖరాగ్ర సమావేశం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో వచ్చే నెల 12, 13వ తేదీల్లో జరగనుంది. `బిల్డింగ్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ ఎండ్ సస్టెనబిలిటీ` అనే ఇతివృత్తంతో జరిగే సమావేశంలో బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల నాయకులతో పాటు, అవుట్‌రీచ్ ఆహ్వానితులు కూడా పాల్గొంటారు. ఉమ్మడి ప్రాధాన్యతలపై బ్రిక్స్ అంతర్గత సహకారాన్ని బలోపేతం చేయడంపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకుంటారు. అలాగే.. పరస్పర ప్రాముఖ్యత కలిగిన ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై తమ అభిప్రాయాలను తెలియజేస్తారు. భారతదేశం అధ్యక్షత వహించిన ఈ సంవత్సర కాలంలో.. రాజకీయ - భద్రత, ఆర్థిక - ద్రవ్య, సాంస్కృతిక - ప్రజల మధ్య మార్పిడులు వంటి ప్రాథమిక అంశాల ద్వారా బ్రిక్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశ్యంతో దేశవ్యాప్తంగా 25కు పైగా నగరాల్లో 350కి పైగా సమావేశాలు, కార్యక్రమాలు జరిగాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =